తల్లిప్రేమ

శ్రీమతి వేలూరి ఇందిరగారు

సుశీలకు బడలిక యెక్కువైంది. బడలికవల్ల ఆయాసంకూడా యెక్కువౌతోంది. ఒళ్లునొప్పి లెక్కువవటంవల్ల కాళ్ళుచాచి తనకాళ్ళు తానే వొత్తుకొనుచు ఒడలు విరుచుకొనుచు వొళ్ళునొప్పులవల్ల శ్రమ యెక్కువపడుచుండు సమయమున సుశర్మగదిలోకి వచ్చి నిలబడ్డాడు. నిజముగ దాంపత్యమన్న సుశీల సుశర్మలదే దాంపత్యము. వారి దేహములు వేరుగాని మనస్సులు, హృదయములు మొదలైన వన్నిటియందు వారిద్దరొక్కటే. వారి దాంపత్యము చూచినయెడల హృదయపూర్వక ప్రేమంతయు వారిలోనే మూర్తీభవించినదా అన్నట్టు ఉంటుంది. అటువంటి వారి సౌఖ్యమే స్వర్గసౌఖ్యము: వారి ఆనందమే బ్రహ్మానందము.

సుశర్మ వచ్చునప్పటికి తనబాధ భర్త చూచి మనస్సు కష్టపెట్టుకొనునను తలంపుతో తన వొళ్ళువిరుపులు మానేసి బాధను కప్పిపుచ్చుచు ఆయాసమును దిగమ్రింగి లేని దార్ఢ్యమును తెచ్చిపెట్టుకొని భర్తనుజూచి హృదయపూర్వకంగా పలుకరించింది, సుశీల.

సుశీల బాధ కనిపెట్టలేకపోతాడా! సుశర్మ. ఆమెబడలిక, ఆయాసం యెంత కప్పిపుచ్చిమాట్లాడినా నిజదేహస్థితి సుశర్మకు తెలుసు.

"వాడి జబ్బువల్ల నీదేహారోగ్యము చెడేటట్టుంది. వాడికి ప్రొద్దున్ననుంచి ఒక్కమాదిరిగా నిలబాటు చేసిందికదూ!" అన్నాడు సుశర్మ.

"అల్లాగేవుంది" అన్నది సుశీల.

కుర్రవాణ్ణి ఆసుపత్రికి తీసుకుపోయి అక్కడ 'యిన్‌పేషెంటువార్డు'లోచేర్పించి మందిప్పించాల్నుంది సుశర్మకు. డాక్టరుచేత మందిప్పిస్తూ యింట్లోనే వుంచాల్నుంది సుశీలకు. ఇంతవరకు సుశీల మాటను దాటలేక యింటిలోనేవుంచి డాక్టరుచేత మందిప్పిస్తూన్నారు. సుశీల నిద్రాహారాలు వర్జించి జబ్బుతోపడియున్న తనకొడుకుప్రక్క కూర్చొని ఉపచారాలుచేస్తూ కాలంగడుపుతూంది. కుర్రవాడికిజబ్బేమీతగ్గడంలేదు సరికదా రోజు రోజు హెచ్చవుతోంది. ఆనాడు హెచ్చుచేసి ప్రొద్దున్నుంచి వొక్కమోస్తరుగా నిలబెట్టింది. మొదట కుర్రవాడికి నాల్గురోజులు తీవ్రజ్వరంకాసి ఆజ్వరం జ్వరం సంధిలోకిదింపింది. ఆసంధిలో తీవ్రమైనసంధి: వెర్రికేకలు, పిచ్చిమాటలు హెచ్చయ్యాయి. ప్రాణాపాయస్థితిలో ఉన్నాడు సుశీలకొడుకు.

"ఈడాక్టరు మందిస్తోంటే తగ్గడంలేదు. యీసాయంత్రందాకా చూచి సాయంత్రం ఆసుపత్రికి తీసుకుపోయి దాన్లోజేర్పించి పెద్దడాక్టరుచేత మందిప్పిస్తా"నన్నాడు సుశర్మ. ఆసుపత్రికి తీసుకువెళ్ళటం ఎంతమాత్రం మనస్కరించడంలేదు సుశీలకు.

అయ్యో! భగవంతుడా నామీద నీకింకా దయపుట్టలేదా? నాకొడుకును ఇవ్వాళ ఆసుపత్రిలో జేర్పింపచేస్తావా! ఇవ్వాళ సాయంత్రంలోగా కొంచెం నింపాదిగా వుండేటట్టుగా చేస్తే వందకొబ్బరికాయలు కొడతానంటూ

వెఱ్రి, వెర్రి మ్రొక్కులు మొక్కింది తన తనయునియందున్న ప్రేమతో, సుశీల.

రాత్రింబవళ్ళు నిద్ర లేకపోవుటచేత, వొళ్ళుబడలికచేత, కొంచెము పేలావన పూని నిద్రించుచున్నప్పుడెల్ల మంచంప్రక్కనకూర్చొని తల మంచంమీదపెట్టి కళ్ళుమూసేది, సుశీల. అటుల నిద్రపోవుటచూచి మంచం ప్రక్కన పక్కవేసి సుశీలకు మెలకువరాకుండా పరుండబెట్టి తానురోగి పక్కనుకూర్చుండెడివాడు సుశర్మ. సుశీలైనను తనకుర్రవాడు జబ్బుతోపడియుండిన కాలమంతలోను రెండు తడవలకన్న కళ్ళుమూసియెరుగదు.

ప్రక్కమీద పడుకోబెట్టిన పదినిముసములకే లేచి నిద్రాదేవతకు శాపనాకారాలుపెట్టుచుతన్ను తాను తిట్టుకొనుచు మరల మంచం ప్రక్కకొచ్చి కూర్చుండేది సుశీల.

ఆరోజున తనభర్త వచ్చి వెళ్లిన పదినిమిషములకల్లా కుర్రవాడిఆయాసం ఎక్కువైంది. డొక్కలెగరేస్తూన్నాడు. సుశీలమంచంమీద కొరిగి ఉచ్ఛ్వాసనిశ్వాసము లెట్లు జరుగుచున్నవో చూచుటకని తనచూపుడువ్రేలు కుర్రవాడి ఘ్రాణేంద్రియములవద్ద పెట్టిచూచింది. దీర్ఘనిశ్వాసము విడుస్తున్నాడు కుర్రవాడు. నీరసమేమో అని చంచాతోపాలుపోసింది, పాలు గొంతుకదిగలా!

అయ్యో తగ్గడంలేదు, ఇవ్వాళ ఆసుపత్రికి కుర్రవాడిని తీసుకుపోతారనే భయం ఎక్కువైంది సుశీలకు.

నాయనా మొన్నటిదాకా పండులాఆడుకున్నావు. రొంపైనా ఎరగకుండా తిరిగావు. సుబ్బి పెళ్లికెళ్ళినప్పుడు నిన్నెవరూ కిందకు దింపేవారుకారురా నాయనా! పాలకైనా ఏడ్చేవాడవుకావురా! హాయిగా తిరుగుతూంటే చూళ్ళేక నీకీజబ్బు పుట్టించాడ్రా మాయదేవుడు. అని పరిపరివిధాల విలపించింది సుశీల.

ఏమిచేయుట కామెకు తోచలేదు. పాలు వేడిగనుంటే త్రాగునేమో అని, స్టవు వెలిగించి పాలు వెచ్చబెట్టి చంచాతో కుర్రవాడి నోట్లోపోసింది గాని తాగలా.

అయ్యోబాబా!! సాయంత్రంలోపల నీకు కొంచమైనా నింపాదిలేకపోతే నిన్ను ఆసుపత్రిలో ఖయిదుచేయుదురుగాబోలు. అయ్యో! నిన్ను ఏవేళో ఖయిదీలాగు నాకు చూపించునుగాబోలు. నిన్ను చూడక నేను నిల్చుటెట్లు? ఇతరులెవరో నీకు వుపచర్యలు చేయుదురు. ప్రేమతో చూతురో లేదో కదా! అందుచేతనే ఆసుపత్రికి వద్దన్నా. కాని నీకు జబ్బు కుదరడం కనిపించడంలేదురా నాయనా అని దుఃఖిస్తూంది సుశీల.

ఔనుగాని కుర్రవాణ్ణి ఆసుపత్రికి కొనిపోవుటే మంచిది. కాని తల్లి ప్రేమ మంచిచెడ్డ లెరుగదు కదా. తన వుపచర్యలు మాన్పించటం తనతనయుని వేరు స్థలములకు గొంపోయి యితరుల పోషణలో పెట్టటం సుశీలకు భరించరాని బాధ కలుగజేస్తూన్నాయి. ఇంక ఆ రోజుతప్పక ఆసుపత్రికి తన బిడ్డను తీసుకుపోవుదురని నిశ్చయించుకుని అల్లాగే మంచంమీద కూర్చొని ఆలోచిస్తూంది సుశీల.

ఆమె అల్లా ఆలోచిస్తూండగా కుర్రాడు కదలి కళ్లువిప్పి చూచి నీరసంతోటి, అయా

468

సంతోటి ఏడవలేక ఏడవలేక తడవడం మొదలెట్టాడు. ఆయేడుపు విచారకరమైన ఆలోచనాతరంగాల్లో వూగులాడుతూన్న సుశీలకు వినబడగానే వులిక్కిపడి ప్రక్కకుతిరిగి తన కొడుకుమీాదకు వంగి తదేకదృష్టిగా చూచింది. ఆమె చూపుకు ఒకవ్యక్తి గోచరమై తక్షణం అదృశ్యమైంది.

ఆవ్యక్తి సుశీలకు చిరపరిచితురాలే. ఆమె యిదివరకు రెండు కుక్కపిల్లలను పెంచింది. ఆకస్మికముగా ఒక కుక్కపిల్లకు జబ్బు చేసింది. ఆ కుక్కపిల్లకు అతిప్రేమతో చంచాలో 'పాలుబ్రాంది' కలపిపోసేది. అది చంచాలో పాలు త్రాగలేనప్పుడు తనబొటనవ్రేలు పాలయందు ముంచి కుక్క నోటబెట్టి కుడిపేది. అట్లు హృదయపూర్వకముగ పెంచి ఆ కుక్కను బ్రతికించుకున్న వ్యక్తి ఆ వ్యక్తి.

ఇపుడు సుశీల మనముచం దా వ్యక్తి సాక్షాత్కరించి అదృశ్యమైంది. ఉత్సాహపూరితంగా మంచంమీాదనుంచి ఆ వ్రేలు కొడుకు నోటియందుంచింది సుశీల.

ఆహా! హృదయపూర్వకముగ నిచ్చు విషమైనను అమృతంవలె పని చేయును గదా లోకంలో.

ఆమె వ్రేలుబిళ్ల నోట జొనిపిందాదిగ బిడ్డ వ్రేలును నొప్పిపెట్టినటుల చప్పరించటం మొదలెట్టాడు. అటుల రెండు మూడు సారులు చప్పరింపచేసి పాలు వేడిగనుండిన త్రాగునేమో అని పాలు వెచ్చబెట్టి తెచ్చి వ్రేలునుంచి చప్పరింపచేసింది సుశీల.

వ్రేలు నోటినుండి తీయుగానే తన తల ప్రక్కలకు త్రిప్పుచు కాళ్లు తన్నుకుంటూ ఏడ్చేవాడు కుర్రవాడు. సుశీలయు సుంతా లస్యములేకుండ తన బిడ్డ నా విధముగ రెండు మూడు చంచాల పాలు త్రావించింది. ఆ పాలు త్రాగినవెంటనే కుర్రవాడు కళ్లు మూసి ఆవలించడం మొదలుపెట్టాడు. నిద్ర పోవునేమోయని మంచంమీాదనుంచి లేచి క్రింద కూర్చొని సుశీల "కాళింగిమడుగుదరికి బోకురా, కృష్ణా" అని జోలపాట మృదు మధుర స్వరముతో పాడుతూ జోలగొట్టి నిద్రబోగొట్టింది.

కుర్రవాడు నిద్రోగానే తన బడలిక తీర్చుకొనుటకు ఒళ్లు విరచి చేతులు జాడించుకొను సమయమున 'సుశర్మ' గదిలోకి వచ్చి వెనుకనుంచి తన ప్రేయసిబుజము మీాద చేయివైచి 'బాబుకు కొంచెం నింపాదిగావుందా" అన్నాడు. మాట్లాడుట కోపికలేక 'నింపాదిగానే వుందన్నట్టుగా తలూపింది సుశీల.

ఆ సమయంలో కుర్రవాడు మేలుకొన్నాడు. ఆమెకువున్న నీరసం తృటికాలంలో మాయమైంది. లేని వోపికవచ్చింది. 'ఏమండో యి_దబ్బున_ఆస్టౌ_పాలు అంది సుశీల అతినీరసంగా. సుశర్మ ఆ స్టౌమీాద వున్న పాలు, చంచా తెచ్చినుంచున్నాడు చూస్తూ.

కుర్రవాడికి కొంచెం బలం చేకూరింది. తల్లి మునపటివిధంగా తన వ్రేలు చప్పరింప

469

చేసింది. కుర్రవాడు గట్టిగా యేడవడం మొదలెట్టాడు. పాలు చాలక ఏడుస్తున్నాడని తెలిసికొని చెంచాతో కాళ్లమీద పడుకోబెట్టుకుని నాల్గు చెంచాల పాలుపోసి మరల మంచంమీద పండబెట్టింది. ఈతడవ కుర్రవాడి మొఖం తేటగ కనిపించింది. కొంచెం, కాళ్లు, చేతులు ఆడిస్తూ ఆడుకోవడం మొదలుపెట్టాడు. ఇదంతా ఆశ్చర్యంగా చూస్తూ నిలబడ్డాడు సుశర్మ తరువాత.

సుశీలా! అఖరుకు నీ తల్లిప్రేమే విజయమొందింది. కుర్రవాడిని ఆసుపత్రికి తీసుకొనిపోనవసరము లేదులే. ఎందుచేతంటే, వాడికి ఇంత హృదయపూర్వక ప్రేమతో ఉపచర్యలు చేయువారుండరు. 'ఆసుపత్రుల్లో' అన్నాడు సుశర్మ తన ప్రేయసిని హృదయపూర్వకంగా ముద్దాడుచూ!—

ఆక్షణమొక్కటె

నజ్ఝల కాళిదాసుగారు

[ప్రమద్వరకొరకు రురుఁడువనమున వెడలుచున్నాఁడు...అశుభసూచకముగా ప్రకృతియే కనఁబడును. ఆతనికనులలో సంభ్రమము...కాని విధి?]

గాలికదలెడుశబ్దంబుకాని, పూలు
రాలిపడుధ్వనికాని, దూరానఁగొండ
నుండిపడునేటిచడికాని, గండుకోకి
లము పలుకుగాని శోకదుశ్రవణములకు

అబ్ధిగర్భంబునుండి బయల్పడియొక
చిరుతమేఘముకప్పిన తరుణసూర్యు;
గొమ్మసందుల చీఁకటిగూటినుండి
యార్చె భయదాయకముగాదివాంధమొండు

పూవులేలేక, సహజవకాపాలుపులేక
జీవసత్వహీనములై యచేతనములు
గాగనంబడెనెల్ల వృక్షములుకూడ
శాఖై శిరాశ్లేష కాలపాశమునబోలె:

ఎందులకొకాని యూతడూహింపలేని
యాతనయొకండు కలఁచెహృదంతరంబు;
వానికనులలో మెరుపులఁ బరవోజేసి
యొటనొకకృశియించె నెదియొయదృష్టరేఖ!

వడివడిగఁబోవు నాతనియడుగులొక్క
మారుగానాగె భయదసంభ్రమపరీత
భావనాచాలితమ్ములై పట్టువీడి,
పథముపాతాళమార్గము పట్టెననఁగ:

వానికన్నుఁబడె ప్రమద్వరయచేత
నముగనేలపైనుంట, కృష్ణమణికవిల
సర్పమొండు మృత్యూగ్రనిశ్వాసమొదవ
పార్శ్వవల్మీకపథమునఁ బరుగులిడుట:

హాయనుచునాతఁడవశుఁడై యామెచెంత
వ్రాలివిలపించె ప్రియప్రమద్వరయటంచు;
ఒక్కపల్కైనియును లేక యొక్కమారె,
క్షణమె-యామెమెల్లనఁ జూచెఁగనులువిచ్చి;

ఆక్షణమ్మొక్కటె యనంతమైయుగయుగ
విలయగతిలేని శాశ్వతనిలయమందు
మూతవడబోని నిర్ఝరపూతదృష్టి
మాలికలువోలెనమరత్వ మహిమగొనినె?

470